క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష గ్రామ సభ

యర్రగొండపాలెం: మండలంలోని వాదంపల్లి, అమానిగుడిపాడు పంచాయతీల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

నేడు వైపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: స్థానిక సచివాలయం-4 పరిధిలోని తిరుమలగిరి కాలనీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పోగొట్టుకున్న నగదు తిరిగి అప్పగింత

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని హోటల్ హరివిల్లులో ఓ వ్యక్తి పోగొట్టుకున్న రూ.17,500 నగదును హోటల్ యాజమాన్యం తిరిగి అప్పగించింది. ఆదివారం మండల కేంద్రంలోని హోటల్ హరివిల్లులో డబ్బులు దొరికిన విషయాన్ని సిబ్బంది యజమానులు కరీం, మజీద్‌లకు తెలపగా ఆ ప్రయాణికుడి కోసం ఆరా తీశారు. మూడు గంటల అనంతరం డబ్బులు పోగొట్టుకున్న ప్రయాణికుడు హోటల్‌కు తిరిగి వచ్చి పోగొట్టుకున్న నగదు వివరాలు తెలపటంతో యజమానులు డబ్బులు అతనికి తిరిగి ఇచ్చారు.

చినమనగుండంలో అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

కొనకనమిట్ల: వైఎస్సార్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని కొనకనమిట్ల మండలంలోని నాగంపల్లి ఎస్సీ కాలనీలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి చినమనగుండం ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యర్రగొండపాలెం: స్థానిక బస్టాండ్ ఆవరణలోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికావడంతో సోమవారం వైపాలెం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ అల్లూరయ్య తెలిపారు. పోలీస్ స్టేషన్, బ్రహ్మంగారి ఆర్చి, ఎస్‌బీఐ బ్యాంక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరినాథరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని డీజీఆర్ వైద్యశాల అధినేత డి.హరినాథరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కొంగలవీడు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. ఉచిత పరీక్షలతో పాటుగా వారికి కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మీప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు భూపాల్ యాదవ్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ముస్లింలు

గిద్దలూరు రూరల్: ముస్లిం మైనార్టీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ముస్లిం మైనార్టీల సంఘం అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషు కోరారు. పట్టణంలోని కొంగలవీడురోడ్డులోని బిలాల్ మసీదు ఆవరణలో ఆదివారం నియోజకవర్గ మైనార్టీ సంఘ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు హుస్సేన్, పీరా, చాంద్‌బాషు, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు బాసట

- రైతు భరోసా అమలుతో తొలగిన కష్టాలు
- ప్రభుత్వ ఆదరణతో కౌలు రైతుల హర్షం



పత్తి పంటలో అంతర సేద్యం చేస్తున్న రైతు

రాచర్ల:

గత ప్రభుత్వాలు కౌలు రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేశాయి. కంటి తుడుపుగా రుణ అర్హత పత్రాలను చేతిలో పెట్టి చేతులు దులుపుకున్నాయి. రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యాజమాన్య రైతులతో సమానంగా కౌలు రైతుల సంక్షేమానికి బాట వేసింది. బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటూనే రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసింది. పెట్టుబడి సాయంతో కౌలు రైతులకు అండగా నిలుస్తోంది. గడిచిన నాలుగేళ్లుగా రాచర్ల మండలంలో వందలాది మంది కౌలు రైతులకు పెట్టుబడి నిధి అందిస్తోంది. రాచర్ల మండలంలోని 14 పంచాయతీల్లో 15 వేల ఎకరాల సాగు భూమి ఉంది. 8 వేలకు పైగా రైతులు ఉన్నారు. 656 మంది దాకా కౌలు రైతులున్నారు. అర్హత రీత్యా 651 మందికి రైతు భరోసా పెట్టుబడి నిధి అందుతోంది. ఏటేటా కౌలు రైతుల లబ్ధి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. గడిచిన మూడేళ్లలో మండలంలో 1418 మంది కౌలు రైతులు పెట్టుబడి సాయం పొందారు. 2020 సంవత్సరంలో 402 మంది, 2021లో 365 మంది, 2022 సంవత్సరంలో 651 మందికి నిధులు మంజూరయ్యాయి.

జగనన్న ప్రభుత్వంపై కౌలు రైతులు హర్షం

గత ప్రభుత్వాలకు భిన్నంగా జగనన్న ప్రభుత్వం సంస్కరణలు తీసుకుని రావడంతో వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా యాజమాన్య రైతులకు సమానంగా పెట్టుబడి సాయం రూ.13,500 మంజూరు చేయడంతో పాటు పెట్టుబడి సాయం, రైతు రుణాలు, గిట్టుబాటు ధరలు కల్పిస్తుండటంతో కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాచర్ల మండలంలో ఇలా..

సంవత్సరం	కౌలు రైతులు	మంజూరైన పెట్టుబడి సాయం
2020	402	రూ.54,27,000
2021	365	రూ.49,27,500
2022	651	రూ.87,88,500

రైతు భరోసా అందింది



చాలాకాలంగా 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్నాను. గతంలో కౌలు రైతులను పట్టించుకునే వారు కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి రైతు భరోసా కింద రూ.13,500 నగదు అందించింది. యాజమాన్య రైతులతో సమానంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుండటంతో చాలా సంతోషంగా ఉంది.

– షేక్.నాయబ్ రసూల్, కౌలు రైతు, రాచర్ల గ్రామం

కౌలు రైతులను ఆదుకోవడం గొప్ప విషయం



గత ప్రభుత్వాలు కౌలు రైతులను పట్టించుకోలేదు. రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులను ఆదుకోవడం గొప్ప విషయం. లక్షలాది మంది కౌలు రైతులకు పెట్టుబడి నిధి అందించడం ఎంతో సంతోషం. మాలాంటి కౌలు రైతులకు రైతు భరోసా అండగా నిలుస్తోంది.

– పానెం భాస్కర్, కౌలు రైతు, యడవల్లి

స్నేహ బంధం.. ఎంత మధురం!



పాఠశాల వద్ద పూర్వ విద్యార్థులు

మార్కాపురం: సుమారు 36 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న బాల్య మిత్రులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ అపూర్వ కలయికకు మార్కాపురం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వేదికైంది. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఆదివారం ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. అనంతరం ర్యాలీగా ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న శుభమ్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుని సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థుల్లో బ్యాంక్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు, పారిశ్రామికవేత్తలు ఉన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలలో తాము చదువుకున్న తరగతి గదులకు వెళ్లి అలనాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. చదువుచెప్పిన గురువులైన విశ్రాంత డీవైఈఓలు మల్లికార్జునరావు, రంగస్వామి, పీఈటీ అల్లూరయ్యను ఘనంగా సన్మానించారు. మిత్ర మండలి సభ్యులైన గుంటక సుబ్బారెడ్డి, పాదర్తి శ్రీను, అన్నా రాము, చంద్ర, జీఎల్ నరసింహరావు, నాగరాజు, తన్నీరు వెంకటరమణ, డాక్టర్ బాషా, డీవీ, కామేశ్వరరావు, ఎంఆర్‌కే బాషా, డీవీఆర్, పీవీ కృష్ణారావు, సుధాకర్, రహ్మతుల్లా తదితరులు ఆత్మీయ సమ్మేళనాన్ని సమన్వయం చేశారు. భవిష్యత్తులో మిత్ర మండలి తరఫున సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

తాళ్లూరు(ముండ్లమూరు): తాళ్లూరు వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991 – 1992 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, కోటిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. విద్యార్థులలో ప్రస్తుతం ఉన్నత శిఖరాలకు ఎదిగిన వారిని అభినందించి దీవించారు. తమతో పాటు చదివి నేడు కష్టంలో ఉన్న వారిని గుర్తించి వారిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. తమ వంతు సాయంగా పాఠశాల అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు.

మూడు రహదారులకు రూ.16.90 కోట్లు మంజూరు

దర్శి: దర్శిలో మూడు రహదారులకు రూ.16.90 కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దర్శి–దొనకొండ రోడ్డుకు రూ.3.10 కోట్లు, గంగవరం –తాళ్లూరు రోడ్డుకు రూ.4.80కోట్లు, వెంకటాచలంపల్లి–దొనకొండ వయా రెడ్డన్నపల్లె, వెస్ట్ గంగవరం రోడ్డుకు రూ.9 కోట్లు నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నిధుల మంజూరుపై నాయకుల హర్షం

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని తూర్పు గంగవరం– తాళ్లూరు రోడ్డు అభివృద్ధికి రూ.4.80 కోట్లు నిధులు మంజూరు చేయించినందుకు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, ఆయన సోదరుడు మండల ఇన్‌చార్జ్ మద్దిశెట్టి రవీంద్రలకు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఆ రోడ్డుతో ఇబ్బందులు పడుతుండగా..ఎట్టకేలకు రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరినట్లు వారు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన వారిలో వైస్ ఎంపీపీలు ఐ వెంకటేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, సర్పంచ్‌లు మేకల చార్లెస్‌సర్జన్, శ్రీకాంత్‌రెడ్డి, వలి, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా తదితరులు ఉన్నారు.

రంగనాయకస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం



జీర్ణోద్ధరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ఆండాలమ్మ, రంగనాయక స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆదివారం ప్రారంభించారు. రంగనాయక స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఈఓ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు, అర్చకుడు అప్పనాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు బి.పుల్లారెడ్డి, కె.మహాలక్ష్మి, తిరుపతయ్య, నాలి కొండయ్యలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే జగనన్న సురక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి

కొనకనమిట్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గరిమినపెంట సచివాలయ పరిధిలోని వలంటీర్లు, గృహసారథులతో పాతపాడులో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. వలంటీర్ల సర్వేలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సర్పంచ్ దొంతిరెడ్డి జయమ్మ చినరామిరెడ్డి, వీఆర్ఓ, కార్యదర్శి పాల్గొన్నారు.

టెక్నాలజీ అభివృద్ధిపై దృష్టి సారించాలి



శ్రీకర్‌ను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

మార్కాపురం: యువత టెక్నాలజీ, యాప్స్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్‌ఆలీబేగ్, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, చీమకుర్తి తహసీల్దార్ పిన్నిక మధుసూదన్ పేర్కొన్నారు. ఇటీవల మ్యాక్స్ ఓట్ యాప్ రూపొందించిన శ్రీకర్‌ను స్థానిక బీసీ భవన్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంపై వచ్చే యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి బాలయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు రంగస్వామిగౌడ్, డాక్టర్ శ్రీకాంత్, పిన్నిక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి పరవశం



మార్కాపురం: ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను అర్చకులు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

త్రిపురాంతకం: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా స్థానిక పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ పర్యవేక్షించింది.

జ్వాలాముఖి ఆలయంలో..

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని బొద్దికూరపాడులోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో ఆషాడమాసం పర్వదినాన అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ముందుగా గణపతి పూజ, మండపారాధన, పంచామృత అభిషేకం, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి విగ్రహ ఊరేగింపు కార్యక్రమం గ్రామ ప్రధాన వీధుల్లో మేళతాళాలతో సాగింది. ఆలయ పూజారులు ఉద్దండు రమణయ్య, నుదురుపాటి వెంకటకృష్ణారావు, కొందూరి ఉమాగౌరి శంకర్ శాస్త్రి, సోమంచి భాస్కర అవధాని శర్మ, కోటా సుబ్రహ్మణ్యశర్మల ఆధ్వర్యంలో పూజలు చేశారు.



జ్వాలాముఖి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

గుంటిగంగా భవానీ ఆలయంలో..

తాళ్లూరు(ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవానీ అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు చేశారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయానికి రూ.11,194 ఆదాయం వచ్చినట్లు ఆర్ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ భాస్కరరెడ్డి భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

శాకంబరీదేవి రూపంలో సత్యమాంబ

బేస్తవారిపేట: మండలంలోని గొట్టిముండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ఆషాఢమాసం సందర్భంగా శాకంబరీదేవిగా అలంకరించారు. అర్చనలు, సహస్రనామ పూజలు, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.



త్రిపురాంతకంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



శాకంబరీదేవిగా కోటా సత్యమాంబదేవి



గంగాభవానీ అమ్మవారు

1363 మంది రైతులకు పంటనష్ట పరిహారం

కొమరోలు: మండలంలో 1363 మంది రైతులకు పంట నష్టపరిహారం మంజూరైనట్లుగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి రాజశ్రీ తెలిపారు. మండలంలో కందిపంట సాగుచేసి వర్షాలకు పంట నష్టపోయిన ఒక్కొక్క రైతుకు రూ.12433 వంతున రూ.2.408 కోట్ల నష్టపరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. మండలంలో 1937.3 ఎకరాల్లో కందిపంట అకాల వర్షాలకు నష్టపోయారని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు గాయాలు



గాయపడిన వెంకటరెడ్డి

మార్కాపురం: బైకు అదుపు తప్పి అన్నాచెల్లెళ్లు గాయపడిన సంఘటన ఆదివారం మార్కాపురం మండలంలోని చింతగుంట్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. త్రిపురాంతకం మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన కె.వెంకటరెడ్డి, నారాయణమ్మ అన్నాచెల్లెళ్లు. కంభంలో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నారు. ఈ క్రమంలో చింతగుంట్ల గ్రామ సమీపాన మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులకు మార్కాపురం జిల్లా వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

మార్కాపురం డివిజన్

99516 02963 (మార్కాపురం)

99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com